


భక్త జన సందడి

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివారులోని మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తజన సందడి కనిపించింది. పలువురు గండా దీపాలతో స్వామికి మొక్కులు చెల్లించారు.



అన్నప్రసాదానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద పథకానికి కృష్ణా జిల్లా గన్నవరం వెంకటపూర్ణనారాయణరావు, హైదరాబాద్‌కు చెందిన తొటిరెడ్డి నిఖిత రూ.1,00,116 చొప్పున విరాళం అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1.633
ప్రస్తుతం	: 1.628.30
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 87.332
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 780
అవుట్ ఫ్లో	: 7,145

న్యూస్‌రీల్

ఈవీఎం గోదాము పరిశీలన



గోదాము తాళాలు తీయిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరచిన గోదామును కలెక్టర్ పి.రంజిత్‌బాషా పరిశీలించారు. శనివారం ఉదయం ఆయన రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో గోదాములను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు నిత్యం పనిచేసేలా చూసుకోవాలని, భద్రతపరంగా కట్టుదిట్టం చేయాలని, గోదాములోని అంతర్గత విభాగాలకు పెద్ద తాళాలు వేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఎన్నికల విభాగం డీటీ మురళీ, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి కె.పుల్లారెడ్డి, బీజేపీ ప్రతినిధి సాయి ప్రదీప్, కాంగ్రెస్ నుంచి షేక్ ఇజాజ్ అహ్మద్, బీఎస్పీ నుంచి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

డీవీఎంసీ సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ పీఓఏ యాక్ట్‌కు సంబంధించి సభ్యుల నియామకాలకు అర్హులైన వారు జనవరి 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే తులసీ దేవి కోరారు. ఐదుగురు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారితో పాటు ఇతర కులాలకు చెందిన ముగ్గురు ఎన్‌జీఓలను తీసుకోవడం జరుగుతుందని ఆమె శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కమిటీ పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని, రెండు పర్యా యాలు కమిటీ సభ్యులుగా కొనసాగిన వారు తిరిగి దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులన్నారు.

నూతన డీఎంహెచ్‌వోగా డాక్టర్ శాంతికళ



కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో)గా డాక్టర్ శాంతికళను నియమిస్తూ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు జీవో జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎంహెచ్‌వోలను వారి విన్నపం మేరకు ఇతర ప్రాంతాలకు, మరికొందరిని డిప్యూటీ సివిల్ సర్జన్‌ల నుంచి సివిల్‌సర్జన్‌లుగా పదోన్నతి కల్పించి ఆయా జిల్లాలకు పోస్టింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న ఆమెకు పదోన్నతి కల్పించి కర్నూలుకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు మూడు నెలలుగా జిల్లా క్షయ నియంత్రణాధికారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎల్.భాస్కర్ ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా వ్యవహరిస్తున్నారు. అలాగే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ హేమనళినికి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సీఎస్ఆర్ఎంవోగా నియమించారు. కర్నూలు జిల్లా బదినేహాలు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణను శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, బి.క్యాంపులోని డిస్పెన్సరీలో పనిచేస్తున్న డాక్టర్ సీహెచ్. రామకృష్ణను అనంతపురం జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా పోస్టింగ్ ఇచ్చారు.

జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన సంబరాలు జిల్లాలో అంబరాన్ని తాకాయి. ఊరూవాడా జగనన్న నినాదం హోరెత్తింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తమ అభిమాననేత పుట్టిన రోజును పండుగలా చేసుకున్నారు. కేకులు కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సీఎంగా జగనన్న అందించిన సంక్షేమ పాలనను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటూ కొనియాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రజలు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఆకాంక్షించి 'హ్యాపీ బర్త్‌డే టూ యూ జగన్' అంటూ నినదించారు.

అభయగిరిలో అనాథ పిల్లల మధ్య కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి





డాన్ బోస్కో అనాథ శరణాలయంలో చిన్నారులకు భోజన బాక్స్‌లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

అభిమానం ఉప్పొంగి.. సేవలు వెల్లివిరిసి

- జిల్లాలో ఘనంగా మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- వెల్లివిరిసిన సేవా కార్యక్రమాలు
- రక్తదానం, దుస్తులు, దుప్పట్ల పంపిణీ
- కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైఎస్సార్ సర్కిల్‌లో మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు ఇన్‌చార్జ్ సతీష్ తదితరులు

కర్నూలు (టౌన్): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం జిల్లాలో పండుగలా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలు నగరంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు నేతలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. అలాగే నగర శివారులోని అభయగిరి అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి అనాథ పిల్లలకు దుస్తులు, వృద్ధులకు స్వెట్టర్లను పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, పార్టీ నాయకులు కిషన్ అందజేశారు. అలాగే కర్నూలు నగరంలోని బిర్లా గడ్డ సమీపంలోని దండి కూడలిలో అడ్డా కూలీల మధ్య జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కూలీలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.

☛ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జననేత జన్మదిన వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. కల్లూరులోని ఆయన నివాసానికి ఉదయమే భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. వారి సమక్షంలో కాటసాని కేక్ కట్ చేశారు. కర్నూలు నగరంలో కార్పొరేటర్ విక్రమ్‌సింహారెడ్డి ఆధ్వర్యంలో శానిటేషన్ వర్కర్లకు కాటసాని దుస్తులు పంపిణీ చేశారు. అక్షయ ఫౌండేషన్ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు నాగార్జున ఆధ్వర్యంలో డాన్ బోస్కో అనాథ శరణాలయంలో చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే కాటసాని చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి వారికి తినిపించారు.



వెల్దుర్తి సీహెచ్‌సీలో బాలుడికి బ్రెడ్డు అందజేస్తున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

☛ నియోజకవర్గ కేంద్రం ఆలూరులో పార్టీ నాయకులు కార్యకర్తలు, భారీగా తరలివచ్చి గుంతకల్లు చెక్‌పోస్టు నుంచి అంబేడ్కర్ సర్కిల్ మీదుగా మహానేత వైఎస్సార్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే విరూపాక్షి ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ, జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

☛ మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి తన స్వగృహంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు.

☛ కోడుమూరు నియోజకవర్గం పరిధిలోని కర్నూలు అర్బన్‌లో 40వ వార్డులో స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమ సింహారెడ్డి నేతృత్వంలో జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు పార్టీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

☛ వెల్దుర్తి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి నాయకత్వంలో జగనన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్డు, జ్యూస్ డబ్బాలు పంపిణీ చేశారు.

☛ ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేశారు. అలాగే 30 మంది జగనన్న అభిమానులు రక్తదానం చేశారు. ఆస్పరి రోడ్డులోని జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలో అనాథలకు అన్నదానం చేశారు.

☛ ఎమ్మిగనూరు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ నిర్వహణలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు. బుట్టా ఫౌండేషన్ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 61 మందికి పైగా అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆస్పత్రికి 200ల కుర్చీలు, రోగుల కోసం దుప్పట్లను ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బాలాజీ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు బుట్టా శివనీలకంఠ, పార్టీ రాష్ట్ర వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు రుద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆదోని జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎమ్మిగనూరు ఆసుపత్రికి బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుర్చీలు, బెడ్‌షీట్లు అందజేస్తున్న బుట్టా శివనీలకంఠ, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు



ఆదోనిలో జగనన్న అభిమానులు రక్తదానం చేస్తున్న దృశ్యం, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు



కర్నూలు దండి సర్కిల్‌లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

ఏకగ్రీవంగా సాగునీటి ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

కర్నూలు (సిటీ): జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. కర్నూలు సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీలకు నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈనెల 14వ తేదీన ప్రాదేశిక నియోజకవర్గాలకు, నీటి వినియోగదారుల సంఘాలకు, 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ మేజర్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా టిప్పు సుల్తాన్, వైస్ చైర్మన్‌గా బావిగడ్డ హుసేన్ సాహెబ్, గాజులదిన్నె ప్రాజెక్టు మీడియం ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మల్లికార్జున గౌడ్, వైస్ చైర్మన్‌గా కె.చిన్నమద్దయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎల్ఎల్‌సీ మేజర్ ప్రాజెక్టు కమిటీని డిస్ట్రిబ్యూటరీ కమిటీలుగా ఎన్నుకోగా ఎన్నికైన వారికి జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ బాలచంద్రారెడ్డి, తుంగభద్ర దిగువ కాలువ ఈఈ శైలేష్ కుమార్, మీడియం ప్రాజెక్టుగా ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు కమిటీకి ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు.



ఎల్లెల్సీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ టిప్పు సుల్తాన్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఈ బాలచంద్రారెడ్డి

తగ్గుతున్న కందుల ధర

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల వరకు రైతులను మురిపించిన కందుల ధర తగ్గుతోంది. ఒక దశలో క్వింటం రూ.13,000కు పైగా పలికింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్ గత ఏడాది బహిరంగ మార్కెట్ ధరకే కందులను కొనుగోలు చేసింది. ఈ సారి కూడా నాఫెడ్ బహిరంగ మార్కెట్ ధర ప్రకారం కందుల కొనుగోలుకు ముందుకు వచ్చి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట కొద్ది రోజులుగా మార్కెట్‌కు వస్తోంది. క్రమంగా ధర తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు 271 మంది రైతులు 1,797 క్వింటాళ్ల కందులు తెచ్చారు. కనిష్ట ధర రూ.1,156, గరిష్ట ధర రూ.7,649 లభించింది. సగటు ధర రూ.7019 నమోదైంది. నూర్పిడిలో ముక్కలు, పగిలిన కందులను ప్రత్యేకంగా కొనుగోళ్లు చేస్తున్నారు. ఇటువంటి కందులు మార్కెట్‌కు 45 క్వింటాళ్లు వచ్చింది, దీనికి క్వింటాలుకు కనిష్టంగా రూ.706, గరిష్టంగా రూ.3600 లభించింది. సగటు ధర రూ.3,200 లభించింది. కందులకు మద్దతు ధర రూ.7550 ఉంది. మద్దతు ధర కంటే తక్కువకు ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తమ్ముళ్లకు తలో దుకాణం!

- షాపులను విభజించి.. డీలర్ పోస్టులు పెంచి..
- కూటమి నాయకులనే డీలర్లుగా నియమించేందుకు రంగం సిద్ధం
- ఇప్పటికే జిల్లాలో 1,233 డీలర్ పోస్టులు
- అదనంగా దాదాపు 200 రేషన్ దుకాణాలు పెరిగే అవకాశం
- దుకాణ విభజనను పూర్తి చేసిన పౌరసరఫరాల అధికారులు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం కేవలం తమ పార్టీ నేతల కడుపునింపడమైనే దృష్టి సారించింది. అర్నెల్ల కాలంలో ఏ నిర్ణయం తీసుకున్నా అందులో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు దోచిపెట్టడమే లక్ష్యంగా కనిపిస్తోంది. అందులో భాగంగా మరో బంపరాఫర్ ఇచ్చేందుకు సర్వం సిద్ధమైంది. పౌరసరఫరాల శాఖలో డీలర్ పోస్టులను అదనంగా సృష్టించి మరీ తమ పార్టీల క్యాడర్‌కు కట్టబెట్టేందుకు ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. సర్కార్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న డీలర్ పోస్టు పరిధిలోని కార్డుల సంఖ్యను తగ్గించి మిగిలిన కార్డులను కలుపుకొని అదనపు పోస్టులను సృష్టించారు. ఈ మేరకు పౌరసరఫరాల అధికారులు విభజన ప్రక్రియ చేపట్టి జిల్లాలో అదనంగా 150–200 వరకు డీలర్ పోస్టులు అందుబాటులోకి తెచ్చేలా సర్వే నిర్వహించారు. ఆయా పోస్టులకు కలెక్టర్ ఆమోదం తరువాత నోటిఫికేషన్ ఇచ్చి కూటమి నేతలకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైంది.



గార్గేయపురంలో రేషన్ బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

షాపులు విభజించి.. డీలరు పోస్టులు సృష్టించి

జిల్లాలో ప్రస్తుతం 1,233 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 6,34,631 మంది రేషన్ కార్డు దారులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీల మధ్య 409 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపులను పెంచాలని నిర్ణయించింది. అయితే ఉన్న షాపులను కుదించి అదనపు దుకాణాలను పెంచేలా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాలను అనుసరించి పౌర సరఫరాల అధికారులు రేషన్ షాపుల విభజన చేపట్టారు. గతంలో ఒక్కో రేషన్ షాపు పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో 600–800 వరకు కార్డుదారులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 400–450 కార్డుదారులకు పరిమితం చేశారు. ఫలితంగా మిగిలిన కార్డుదారులతో అదనపు డీలర్ పోస్టును సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లోని రేషన్ షాపు పరిధిలో 800పైగా కార్డుదారులు ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 500–550 వరకు కుదించారు. అలాగే మునిసిపల్ కార్పొరేషన్లలో 650 కార్డులు ఉండేలా విభజన చేసి అదనపు డీలర్ పోస్టులను సృష్టించారు. ఇందుకోసం ఇటీవల సర్వే నిర్వహించి విభజన ప్రక్రియను పూర్తి చేశారు. దాదాపు 150–200 వరకు అదనపు డీలర్ పోస్టులు సృష్టించినట్లు తెలుస్తోంది.

వేధించి డీలర్లను తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం...

ప్రస్తుతం ఉన్న డీలర్లను రాష్ట్ర ప్రభుత్వం వేధిస్తోంది. వారికి పార్టీల ముద్ర వేసి తొలగించేందుకు 6ఏ కేసుల అస్త్రాన్ని ప్రయోగిస్తోంది. స్థానికంగా టీడీపీ నాయకులు చెప్పిన మాట ప్రకారం ఉన్న డీలర్లు తమ పదవిని వీడితే ఏమిలేదు. లేకపోతే 6ఏ కేసు నమోదు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయించి వేధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 39 6ఏ కేసులు నమోదు చేసి 2,199 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 28 వాహనాలను సీజ్ చేశారు. ఇందులో 28 మంది డీలర్లపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు.

జిల్లాలో 117 డీలర్ పోస్టులు ఖాళీ..

ప్రస్తుతం ఉన్న 1,233 రేషన్ షాపులకు సంబంధించిన డీలర్ పోస్టుల్లో 117 ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఆదోని డివిజన్‌లో 38, కర్నూలు డివిజన్‌లో 46, పత్తికొండ డివిజన్‌లో 33 డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఖాళీ పోస్టులను తాత్కాలికంగా సమీపంలోని డీలర్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి ఉంటారు. ఇన్‌చార్జీలు లేని చోటా వీర్వోలతో సరుకులను పంపిణీ చేయిస్తున్నారు.

నివేదిక కలెక్టర్‌కు అందజేశాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల రేషన్ షాపుల పరిధిని తగ్గించేందుకు విభజన ప్రక్రియను చేపట్టాం. తద్వారా కొత్తగా రేషన్ షాపులను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. ఆయన నుంచి అనుమతులు రాగానే కొత్త డీలర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటాం. ఖాళీ పోస్టులను కూడా భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాజారఘువీర్, డీఎస్ఓ, కర్నూలు

త్వరలోనే డీలర్ పోస్టుల భర్తీకి చర్యలు..

పౌరసరఫరాల శాఖ కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలకు రాజకీయ విడిది కేంద్రంగా మారింది. ఉన్న డీలర్లను తొలగించి తమ వారిని నియమించుకున్నారు. అంతేకాక డీలర్ పోస్టులను సృష్టించి మరీ తమ పార్టీల నాయకులకు కట్టబెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఖాళీ పోస్టులతోపాటు సృష్టించిన అదనపు డీలర్ పోస్టుల భర్తీకి అనుమతి కోసం పౌరసరఫరాల శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ఆయన అనుమతి ఇస్తే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేసేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

క్రిమినల్ ప్రొసీజర్‌పై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా కోర్టు న్యాయయూర్తుల వర్క్‌షాపులో హైకోర్టు జడ్జి మన్మథరావు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న జస్టిస్ డాక్టర్ మన్మథరావు

కర్నూలు(సెంట్రల్): క్రిమినల్ ప్రొసీజర్‌పై న్యాయమూర్తులు అవగాహన పెంచుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా పోర్టుఫోలియో జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మథరావు సూచించారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులకు క్రిమినల్ ప్రొసిజర్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్పష్టమైన సాక్షాలు ఉన్న కేసులపై సాగదీత అవసరం లేదన్నారు. బీమా కంపెనీల మోసాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సైబర్ నేరాలు పెరిగాయని, కొందరు నేరస్తులు సాంకేతిక పరిజ్ఞానంతో తప్పించుకోవడానికి చూస్తున్నారన్నారు.ఈ నేపథ్యంలో న్యాయమూర్తులు టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జి బీవీఎల్ఎన్ చక్రవర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, సీనియర్ అడ్వొకేట్ రోజ్‌ధర్ పాల్గొన్నారు.

జడ్జీలను కలిసిన జిల్లా కలెక్టర్

జిల్లాకు వచ్చిన ఏపీ హైకోర్టు జడ్జీలు జస్టిస్ డా.కె. మన్మథరావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తిని స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా కలిశారు. వారికి మర్యాదపూర్వకంగా బొకేలు అందించి మాట్లాడారు.

విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం

మద్దికెర : జిల్లాలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే సత్వరమే పరిష్కరించడం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి అన్నారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై సిబ్బంది వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. మద్దికెర గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని ఈఓ శివకుమార్, సర్పంచ్ సుహాసిని ఎస్ఈకి విన్నవించారు. నిబంధనల ప్రకారం వాటిని వెంటనే మార్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

క్లుప్తంగా

నిందితుడి అరెస్ట్

ఆస్పరి: మతిస్థిమితం లేని మహిళను అత్యాచారం చేసిన కేసులో నిందితుడు హనుమంతును అరెస్ట్ చేసినట్లు ఆస్పరి సీఐ మస్తాన్ వలి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ముత్తుకూరు గ్రామంలో ఈనెల 17న మతిస్థిమితం లేని మహిళను హనుమంతు ఇంట్లో బంధించి అత్యాచారం చేసినట్లు కేసు నమోదు చేశామన్నారు. శనివారం ముత్తుకూరు గ్రామానికి వెళ్లే బస్టాప్ వద్ద హనుమంతును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

రెండు బైకులు దగ్ధం

కర్నూలు: పాత కల్లూరులో ఇంటి ముందు పార్కు చేసి ఉంచిన రెండు బైకులు దగ్ధమయ్యాయి. బజ్జీల దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఓంకారయ్య, అతని అల్లుడు వినోద్ వ్యాపారం ముగించుకుని రాత్రి ఇంటి వద్ద దర్గా పక్కన తమ వాహనాలు స్కూటీ, పల్సర్ పార్కు చేశారు. ఉదయం లేచి చూసే సరికి రెండు కూడా కాలిపోయాయి. ఆకతాయిలు లేదా మందుబాబులు నిప్పు పెట్టి ఉండవచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ బాధితులు నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై గొడ్డలితో దాడి

ఉయ్యాలవాడ: మహిళపై దాడి చేసిన ఘటనలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. హరివరం గ్రామానికి చెందిన పాలాజీ కాంతమ్మ, అదే గ్రామానికి చెందిన దండు ఆవేలు కుళాయి నీరు వృథాగా ఇంటి ముందు పారుతున్న విషయంలో మాటమాట అనుకున్నారు. ఆవేశంలో దండు ఆవేలు గొడ్డలితో కాంతమ్మపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపాశారు.

హోటళ్లు, రెస్టారెంట్లపై రూ.1.05 లక్షల జరిమానా

నంద్యాల(అర్బన్): జిల్లాలోని బేకరి షాపులు, కిరాణం షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నాణ్యత ప్రమాణాలు తక్కువగా ఉన్నాయని తేలడంతో 6 కేసులు నమోదు చేసి రూ.1.05 లక్షలు జరిమానా విధించినట్లు ఆహార భద్రతా అధికారి వెంకటరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సింతటిక్ ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్, ఆహార పదార్థాల్లో వాడారని, వాటిని రసాయనిక పరీక్షల నిమిత్తం స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపామన్నారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



కార్మికులకు కంటి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ జయప్రకాష్

కర్నూలు(హాస్పిటల్): వాహన డ్రైవర్లు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని భారత్ గ్యాస్ ప్లాంట్ మేనేజర్ అరుణ్‌కుమార్ సూచించారు. భారత్ గ్యాస్ ఎల్‌పీజీ టెరిటరీ గ్యాస్ ఫిల్లింగ్ ప్లాంట్, బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం వాహన డ్రైవర్లకు, ఇతర కార్మికులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు డాక్టర్ జయప్రకాష్, భారత్‌గ్యాస్ రీజినల్ ఫిల్లింగ్ నేషనల్ స్టేషన్ ఆపరేషన్స్ మేనేజర్ లతీఫ్, లయన్స్ క్లబ్ మాజీ అడిషనల్ జిల్లా కేబినెట్ సెక్రటరీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.నాగరాజు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యలో విద్యార్థులను తీర్చిదిద్దండి

● డీఈఓ శామ్యూల్‌పాల్



కేజీబీవీలో విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను సాంతిక విద్యలో తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్ ఉపాధ్యాయులకు సూచించారు. వెల్దుర్తి జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా బాలుర హైస్కూల్‌లోని పాల్ ల్యాబ్(పర్సనలైజ్ అడాప్టివ్ ల్యాబ్)ను పరిశీలించి విద్యార్థులకు అందించే బోధనపై ఆరా తీశారు. ల్యాబ్ రూం శుభ్రంగా లేకపోవడం, వెలుతురు సక్రమంగా లేకపోవడం, ప్రశ్నలకు విద్యార్థులు సరైన సమాధానలు చెప్పలేకపోవడంతో డీఈఓ అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద వెల్దుర్తి బాలుర హైస్కూల్‌ను ఎంపిక చేసి 30 ట్యాబ్‌లు అందజేశామన్నారు. జిల్లాలో మరో 50 స్కూళ్లలో టెక్నాలజీ విద్య అమలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అయితే పాల్ ట్యాబ్ బోధన విద్యార్థులకు అందించడంలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా చివరి స్థానంలో ఉండటం బాధాకరమన్నారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా లేదని హెచ్‌ఎంను మందలించారు. విద్యార్థులకు పాల్ ట్యాబ్ విద్య అందించడంలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇలాగే కొనసాగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మధ్యాహ్నం భోజనం కట్టెల పొయ్యిపై చేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్యాస్ పొయ్యిపై మాత్రమే చేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల సామర్థ్యాలను పరీక్షించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ శాకీరాబేగంకు సూచించారు.

నన్నూరులో దొంగల హల్‌చల్

● వరుసగా మూడు ఇళ్లలో చోరీ
● రూ.1.50 లక్షల విలువ చేసే వస్తువులు అపహరణ

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చేశారు. వరుసగా రెండు ఇళ్లు, ఓ దుకాణంలో చోరీకి పాల్పడి, అందినకాడికి దోచుకెళ్లారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు.. సీతారామ నగర్‌లో నివాసముంటున్న మనోహర్, కోటకొండ సత్యరాజు ఇళ్లకు తాళాలు వేసి, బంధువుల పెళ్లికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు వారి ఇంటి ముందు ఉన్న ఇంటికి బయటకు రాకుండా, బయట గడియ వేసి, పథకం ప్రకారం మనోహర్ ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి లోపలకు చొరబడ్డారు. ఇంట్లోని బీరువాను పగులగొట్టి రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. సమీపంలో ఉన్న ఎద్దుల ఎల్లారెడ్డి వ్యవసాయ పనిముట్ల దుకాణంలోకి చొరబడి రూ.50 వేల విలువ చేసే పనిముట్లను తస్కరించారు. అక్కడి నుంచి కోటకొండ సత్యరాజు ఇంట్లోకి ప్రవేశించి రూ.30 వేల నగదుతో ఉడాయించారు. చోరీ జరిగిందని గుర్తించిన బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమారు తెలిపారు.

ఇద్దరు నిందితుల అరెస్ట్



నిందితులను చూపుతున్న సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: వివాహ వేడుకలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి నిండు ప్రాణాలు కోల్పోయేందుకు కారకులైన ఇద్దరిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ తబ్రేజ్ తెలిపిన వివరాలు.. ఈనెల 14న సుందరయ్య నగర్‌లో ఓ వివాహ వేడుక జరుగుతుండగా సురేంద్ర, జంబులయ్య మద్యం మత్తులో మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న దేవేంద్ర, మధుబాబు(25).. సురేంద్ర, జంబులయ్యను వారించి అక్కడి నుంచి పంపించేందుకు యత్నించారు. కాగా మద్యం మత్తులో ఉన్న సురేంద్ర, జంబులయ్య మధుబాబుపై రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు మధుబాబును చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక ఈనెల 17న మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

● మున్సిపల్ అధికారులతో మున్సిపల్ డైరెక్టర్ కన్నబాబు సమీక్ష



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ డైరెక్టర్ కన్నబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు కన్నబాబు అధికారులను ఆదేశించారు.శనివారం రాత్రి స్థానిక నగరపాలక కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగం పరిధిలోని ప్రగతిని సంబంధిత మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ నగరపాలక పరిధిలో జరిగే పలు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. సమన్వయంతో అధికారులు పనిచేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ రవీంద్రబాబు, అదనపు కమిషనర్ కృష్ణ, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్లు జునీద్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

గడువులోపు పంట రుణాలు చెల్లిస్తే వడ్డీ రాయితీ

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకుల నుంచి పంట రుణాలు పొంది... గడువులోపు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిందని ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకుల నుంచి రూ.లక్షలోపు పంట రుణం తీసుకొని గడువులోపు చెల్లిస్తే 4 శాతం వడ్డీ రాయితీ లభిస్తుందని తెలిపారు. పంట రుణాలపై 7 శాతం వడ్డీ ఉంటుందన్నారు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పంట రుణం తీసుకొని గడువులోపు చెల్లిస్తే కేంద్రం 3 శాతం ఇంటెన్సివ్ ఇస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క శాతం రాయితీ ఇస్తుందని తెలిపారు. 2022–23 రబీలో పంట రుణం పొంది గడువులోపు చెల్లించిన రైతులకు కూడా ఈ సదుపాయం వర్తిస్తుందని తెలిపారు.

అహోబిలం మాజీ ఉద్యోగిపై కేసు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం దేవస్థానం మాజీ ఉద్యోగి సేతురామన్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల దేవస్థాన సిబ్బందికి సేతురామన్ ఫోన్ చేసి కొందరు భక్తులను పంపిస్తున్నానని, వీఐపీ దర్శనం చేయించాలని సూచించారు. సిబ్బంది భక్తులను ఆలయంలోకి తీసుకెళ్తుండగా అక్కడే ఉన్న జనరల్ మేనేజర్ మురళీధరన్ అడ్డుకుని ఎవరు చెప్పినా టికెట్ తీసుకోవాల్సిందేనంటూ దగ్గరుండి టికెట్ కొనిచ్చి దర్శనానికి పంపించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై సేతురామన్ తాను పంపంచిన భక్తులను అవమానపరుస్తారా అంటూ ఫోన్‌లో దూషిస్తూ బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని మేనేజర్ ఫిర్యాదు మేర కు పోలీసులు కోర్టు అనుమతితో సేతురామన్‌పై కేసు నమోదు చేశామని రూరల్ పోలీసులు తెలిపారు.

మద్దిలేటయ్య ఆదాయం రూ.4,03,515

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రం లక్ష్మీమద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్కరోజే రూ.4,03,515 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ధనుర్మాసం సందర్భంగా స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలి వచ్చిన భక్తులు వివిధ సేవల ద్వారా రూ.4,03,515 సమర్పించుకున్నారు.

మహానందిలో భక్తుల సొమ్ము అపహరణ

మహానంది: మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తుల సొమ్ము శనివారం చోరీకి గురైంది. తెలంగాణా రాష్ట్రం సిద్దిపేటకు చెందిన అందె శ్రీనివాసులు, కిషన్ గౌడ్ మరో ఐదుగురు మహానందీశ్వర స్వామివారి దర్శనార్థమై వచ్చారు. పెద్ద కోనేరులో స్నానమాచరిస్తుండగా గట్టు మీద ఉంచిన దుస్తులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అందులో సుమారు రూ.20వేల నగదు, కారు తాళాలు, ఏటీఎం కార్డులు ఉన్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా చోరీ చేసిన వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దొంగతనానికి పాల్పడిన వారు మహారాష్ట్రకు చెందిన వారిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

27 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని 27 గ్రామాల్లో శనివారం రెవెన్యూ సదస్సులు జరిగినట్లు కలెక్టర్ పి.రంజిత్‌కుమార్ తెలిపారు. మొత్తం 27 గ్రామాల్లో కలిపి 372 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. వీటికి రెండు వారాల్లో పరిష్కారాలు చూపేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. మరోవైపు సోమవారం జిల్లాలో 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ వాహన డ్రైవర్ పోస్టుల భర్తీకి కృషి చేస్తాం

● ఏఐజీడీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కన్నన్



కన్నన్‌ను సత్కరిస్తున్న ఏఐజీడీఎఫ్ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ వాహన డ్రైవర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్(ఏఐజీడీఎఫ్) జాతీయ అధ్యక్షుడు పి.కన్నన్ తెలిపారు. శనివారం ఆయన కర్నూలుకు వచ్చిన సందర్భంగా ఏఐజీడీఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షుడు సర్దార్ అబ్దుల్‌హమీద్, జాయింట్ సెక్రటరీ ఇలియాస్‌బాషా, కర్నూలు ప్రభుత్వ వాహన డ్రైవర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కన్నన్ మాట్లాడుతూ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ వాహన డ్రైవర్లు తగ్గిపోతున్నారని, ఖాళీ అవుతున్న పోస్టులను కొన్నేళ్లుగా భర్తీ చేయడం లేదని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఖాళీలను భర్తీ చేసేలా కృషి చేస్తామన్నారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంక్షేమానికి ఏఐజీడీఎఫ్ ఉద్యమిస్తుందన్నారు.

వడ్లు నేలపాలు



దిగుబడులు నేలపాలైన దృశ్యం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన రైతు వెంకటేశ్వరమ్మకు చెందిన వడ్లను గుర్తుతెలియని దుండగులు నేలపాలు చేశారు. మహిళా రైతు తెలిపిన వివరాలు.. అర ఎకరంలో వరి సాగు చేసుకుంది. శుక్రవారం పంట కోత కోసి ధాన్యం దిగుబడులను కల్లంలో రాశిగా పోసి టార్పాలిన్లు కప్పి ఇంటికి వెళ్లింది. శనివారం అటుగా వెళ్తున్న రైతులకు దిగుబడుల రాశి చిందరవందర అయి ఉండటం గమనించి వెంకటేశ్వరమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి చేరుకుని దిగుబడులు నేలపాలై ఉండటం చూసి బోరున విలపించింది. గిట్టని వారే వడ్లను ఇష్టం వచ్చినట్లు చల్లి నాశనం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మురుగునీటి సమస్యపై త్రిసభ్య కమిటీ విచారణ



విచారణ చేపడుతున్న అధికారులు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లిలో డీపీఓ జమీఉల్లా, ఆర్డీఓ నరసింహులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ శనివారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన రైతు పద్మభూషణ్ రెడ్డి తన పొలంలోకి మురుగునీరు వస్తున్నట్లు ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో జిల్లా కలెక్టర్ గణియా రాజకుమారి త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి గ్రామంలో విచారణ చేపట్టి నివేదిక పంపాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామానికి చేరుకున్న అధికార బృందం విచారణ చేపట్టారు. రైతు పొలంలోకి వస్తున్న మురుగునీటిని మరో ప్రాంతం ద్వారా మళ్లించడానికి గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయంగా మురుగు కాలువ నిర్మాణం అత్యంత ఖర్చుతో కూడుకున్నట్లు అధికారులు గుర్తించారు. నివేదిక కలెక్టర్‌కు పంపుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ బాలకృష్ణుడు ఉన్నారు.

డిపాజిట్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈఓ విజయకుమార్



డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్న డీసీఓ ఎస్.రామాంజనేయులు, డీసీసీబీ సీఈఓ విజయకుమార్

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రారంభించిన సహకార వాత్సల్య డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయకుమార్ సూచించారు. శనివారం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిపాజిట్ పథకాన్ని జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. 222 రోజులకు డిపాజిట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు 7.70 శాతం(ఎఫెక్టివ్ రేట్ 7.95 శాతం), ఇతరులకు 7.10 శాతం (ఎఫెక్టివ్ రేట్ 7.30 శాతం) వడ్డీ లభిస్తుందన్నారు. 555 రోజులకు డిపాజిట్ చేస్తే సీనియర్ సిటిజన్లకు 9 శాతం(ఎఫెక్టివ్ రేట్ 9.60 శాతం), ఇతరులకు 8.40 శాతం(ఎఫెక్టివ్ రేట్ 8.90 శాతం) వడ్డీ రేటు లభిస్తుందన్నారు. డిపాజిట్ పథకం జనవరి 20వ తేదీ వరకు అమలులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఆప్కాబ్ ఏజీఎం నహిదా సుల్తాన, జిల్లా సహకార ఆడిట్ అధికారి శిరీష పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో యూరిన్ టెస్ట్ మిషన్ ఏర్పాటు



యూరిన్ టెస్ట్ మిషన్ వద్ద సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ సీతారామయ్య

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యురాలజీ ఓపీ విభాగంలో మూత్ర ప్రవాహ పరీక్ష(యూరిన్ టెస్ట్ మిషన్) ఏర్పాటు చేశారు. శనివారం దీనిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల మూత్ర సంబంధిత సమస్య ఉన్నప్పుడు తేలికగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరిన్ టెస్ట్ చేయడానికి ఈ మిషన్ ఉపయోగపడుతుందన్నారు. రూ.1.50 లక్షల విలువైన మిషన్‌ను నంద్యాలకు చెందిన డాక్టర్ లక్ష్మీసౌజన్య విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, యురాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలరవితేజ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వెంకటమహేష్, డాక్టర్ అరుణ్‌కుమార్, పీజీలు డాక్టర్ హిమజ, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఉమామహేశ్వర, డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.